క్లుప్తంగా

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం 16.36 లక్షలు



హుండీ లెక్కిస్తున్న శివజ్యోతి సంఘం సభ్యులు

సీతమ్మధార : ఆశీలమెట్ట శ్రీసంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపు గురువారం జరిగింది. దేవదాయ శాఖ తనిఖీదారులు వి.వసంతకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపులో 21 రోజులకు రూ.16.36 లక్షల నగదు, 25.700 మిల్లీగ్రాముల బంగారం, 133 గ్రాముల వెండి, పలు దేశాలకు చెందిన డాలర్లు వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపకుడు, ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. హుండీ లెక్కింపులో శివజ్యోతి, శ్రీవెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, సిబ్బంది జి.గోవింద్‌రెడ్డి, డీఎస్ ప్రసాద్, ఈ.అప్పలరాజు, భక్తులు, బ్యాంకు ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

నూతన నియామకం

దాబాగార్డెన్స్: కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ రాష్ట్ర అదనపు కార్యదర్శిగా నగరానికి చెందిన అంబల్ల సురేష్‌నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు కమిషన్ ప్రతినిధులు తనుజారెడ్డి, త్రినాథ్ నియామకపత్రం అందజేశారు. వినియోగదారుల హక్కుల గూర్చి అవగాహన పెంపొందించేందుకు, వారి రక్షణను ప్రోత్సహించే లక్ష్యంతో కమిషన్ పని చేస్తుందని సురేష్‌నాయుడు తెలిపారు. తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యత అప్పగించిన కమిషన్ ప్రతినిధులు రమేష్, నాగమల్లేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు కంటి పరీక్షలు



కళ్లజోళ్లు అందజేస్తున్న కార్పొరేటర్ అప్పలరత్నం

దాబాగార్డెన్స్: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 30వ వార్డు తాడివీధి కమ్యూనిటీ హాల్లో గురువారం కంటి చూపు పరీక్షలు నిర్వహించారు. చూపు సమస్యతో బాధపడుతున్న పేద ప్రజలకు పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అవసరమైన వారికి వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం చేతుల మీదుగా కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో వార్డు ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



విశాలాక్షినగర్‌లో సాయిబాబా

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షి నగర్ కైలాసగిరి కూడలిలో సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయ 19వ వార్షికోత్సవం శుక్రవారం జరగనుంది. ఇందు కోసం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయంలో సాయి బాబాకు ఉదయం నుంచి పూజలు చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నామన్నారు.

బుల్లయ్య కాలేజీలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మధుకుమార్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభమవుతున్న సందర్భంగా గురువారం కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ జి.మధుకుమార్ సంబంధిత పోస్టర్లు ఆవిష్కరించారు. కళాశాలలో గత నెల కోర్సు క్యాంప్ నిర్వహించామన్నారు. వివిధ కళాశాలల అధ్యాపకులు, బుల్లయ్య కాలేజీ లెక్చరర్లు కోర్సును పూర్తి చేశారని తెలిపారు.

రెండో భద్రాద్రి

- అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని తీర్చిదిద్దుతున్న దేవదాయశాఖ
- రాములోరి కల్యాణానికి చురుగ్గా ఏర్పాట్లు

రెండో భద్రాద్రిగా ఖ్యాతినందుకునే స్థాయిలో కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని తీర్చిదిద్దే పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. అందుకు సంబంధించి పాలకవర్గం పలు నిర్ణయాలు తీసుకుంది. అత్యంత వైభవంగా సీతారామచంద్రస్వామి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భద్రాద్రి స్థాయిలో రాముని కల్యాణం నిర్వహించేందుకు ఆలయ ఈవో కె. శిరీష ప్రత్యేక దృష్టి సారించారు.



అంబికాబాగ్ రామాలయంలో సీతారామలక్ష్మణ హనుమత్ స్వామి



రామాలయ ప్రధాన గోపురానికి రంగులద్దుతున్న సిబ్బంది

దాబాగార్డెన్స్ : రెండో భద్రాద్రిగా తీర్చిదిద్దుతున్న నగరంలోని అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం ఈ నెల చివరి రోజున వచ్చే రాములోరి పుట్టినరోజైన శ్రీరామనవమికి సిద్ధం కానుంది. కనకమహాలక్ష్మి దేవస్థాన దత్తత దేవాలయంలో పనులు దాదాపు పూర్తయ్యాయి. సువిశాలమైన పన్నెండు వేల చదరపు గజాల స్థలంలో నిర్మించిన అంబికాబాగ్ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు ఉత్తరాంధ్ర జిల్లాలకు తలమానికంగా నిలువనున్నాయి. రాష్ట్రంలో అతి ప్రాచీనమైన ఒంటిమిట్ట రామాలయంలో ప్రభుత్వం అధికారికంగా శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ ఉత్తరాంధ్ర జిల్లాల భక్తులకు అంబికాబాగ్ రామాలయం రెండో భద్రాద్రిగా నిలవనుంది. కల్యాణానికి సంబంధించి అంబికాబాగ్ రామాలయం, కనకమహాలక్ష్మి దేవస్థానంలో టిక్కెట్లు విక్రయించనున్నారు.

500 మంది ఉభయదాతలచే

సామూహిక కల్యాణాలు : ధర్మకర్తల మండలి సహకారంతో కనీసం 500 మంది ఉభయదాతలచే కల్యాణాలు నిర్వహించాలన్న సంకల్పంతో పాలకవర్గం ఏర్పాట్లు చేస్తోంది. కల్యాణంలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేరు, గోత్రనామాలు నమోదు చేసుకోవాలి. కల్యాణంలో పాల్గొన్న ఉభయ దాతలకు స్వామి వారి శేషవస్త్రం, ముత్యాల తలంబ్రాలు అందజేయనున్నారు. సీతారామ కల్యాణాన్ని పురస్కరించుకుని 5 వేల మంది భక్తులకు పిండివంటలతో కల్యాణ విందు ఏర్పాటు చేయనున్నారు.

ఆలయచరిత్ర..

మహారాణిపేటలో గల అంబికాబాగ్ రెండెకరాల 70 సెంట్ల సువిశాల స్థలంలో ఉంది. ఈ స్థలంలో శ్రీరామ మందిరం నిర్మించి సీతారామచంద్ర లక్ష్మణ సమేత హనుమాన్ దారు విగ్రహాలు ఏర్పాటు చేసి నిత్య పూజలు నిర్వహించే వారు చెముడు ఎస్టేట్ వంశీయుల పట్టపురాణి చంద్రమణీదేవి. తన తదనంతరం ఆ స్థలంలో రామాలయం నిర్మించాలన్నదే ఆమె కోరిక. రూ.6 కోట్ల అంచనా వ్యయంతో రామాలయ నిర్మాణానికి 2011 జూన్ 20న శంకుస్థాపన చేశారు. అప్పటి ప్రభుత్వం నుంచి ఆశించినంత నిధులు రాకపోవడంతో ఆలయ అభివృద్ధి పనులు నత్తనడకన సాగాయి. ఈ నేపథ్యంలో ఆలయ నిర్మాణానికి కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నుంచి రూ.2 కోట్లు, సీజీఎఫ్ ఫండ్స్ కింద మరో రెండు కోట్లు రాగా, రూ.50 లక్షల వరకు దాతలు సమకూర్చారు. ప్రస్తుత ప్రభుత్వం నుంచి మరికొంత నిధులు రావడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి.

భారీ విగ్రహాలు.. 6 అడుగుల 3 అంగుళాల రామచంద్రుడు, 5 అడుగుల 9 అంగుళాల సీతా లక్ష్మణులు, హనుమత్ రాతి విగ్రహాలతో పాటు ఉత్సవమూర్తులను తిరుపతి దేవస్థానం ద్వారా చేయించి 2019 మే 4న ప్రతిష్ఠించారు. తిరుమలలో ఉన్న 6 అడుగుల శ్రీరామచంద్రుని విగ్రహం తర్వాత అంత ఎత్తుగల ఆజానుబాహుడైన శ్రీరామచంద్రమూర్తిని సీతా, లక్ష్మణ, ఆంజనేయులతో కలిపి భక్తుల కోసం ఇక్కడే ప్రతిష్ఠించారు.

పెద్ద ఎత్తున శ్రీరామనవమి వేడుకలు



కనకమహాలక్ష్మి అమ్మవారి దత్తత ఆలయంగా అంబికాబాగ్ రామాలయాన్ని దేవదాయశాఖ తీసుకుంది. శ్రీరామనవమి వేడుకలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నాం. 500 మంది ఉభయదాతలచే స్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. 5 వేల మంది భక్తులకు మహాన్నదాన కార్యక్రమం చేపట్టనున్నాం. మరో భద్రాద్రిగా ఉత్తరాంధ్ర జిల్లాల వాసులకు అందుబాటులోకి తెస్తాం. దేవదాయ శాఖ సూచనల మేరకు రాములోరి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

కె. శిరీష, ఆలయ ఈవో.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించండి



ఫుట్‌పాత్ ఆక్రమణలపై అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్ రాజాబాబు

దాబాగార్డెన్స్: నగరంలో ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ పి. రాజాబాబు పట్టణ ప్రణాళికాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కమిషనర్ గురువారం చినవాల్తేర్ నుంచి అప్పుఘర్ వరకు నడక మార్గాన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లపై చాలా వరకు ఆక్రమణలు ఉన్నాయని, కార్ల సర్వీసింగ్ సెంటర్ వద్ద చాలా వరకు ఫుట్‌పాత్‌లపై దుకాణాల వంటివి పెట్టకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. ఎలక్ట్రికల్ పోల్స్‌కు కేబుల్ వైర్లు వేలాడుతున్నాయని, వాటిని క్రమబద్ధీకరించి కట్టాలని, అనవసర కేబుల్ వైర్లు వేలాడుతున్నాయని, వాటిని తొలగించాలని ఆదేశించారు. పలు చోట్ల మొక్కలకు ట్రిమ్మింగ్ చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు తొలగించేలా ఆ స్థల యజమానులకు తెలిపి, వారిచే శుభ్రం చేయించాలన్నారు. ప్రధాన రోడ్లకు కనెక్ట్ అవుతున్న అప్రోచ్ రోడ్ల మరమ్మతులు చేపట్టి ఆకర్షణీయంగా కనిపించేలా చూడాలన్నారు. రేసపువాని పాలెం గణేష్‌నగర్ వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని ఆ స్థల యజమానులచే శుభ్రం చేయించాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం సంతృప్తికరంగా ఉన్నప్పటికీ ఇంకా మెరుగ్గా ఉండేలా చూడాలని, సెంట్రల్ మీడియంలో ఆకర్షణీయంగా ప్లాంటేషన్ పచ్చగా కనిపించే విధంగా చర్యలు చేపట్టాలని, రాత్రిపూట పశువుల సంచారం లేకుండా చూడాలని ఆదేశించారు. సైడ్ మీడియన్లలో భవన నిర్మాణ వ్యర్థాలు కనిపిస్తున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళికాధికారులను ఆదేశించారు. పర్యటనలో హార్టీకల్చర్ డీడీ దామోదరరావు, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, డీసీపీ సంజయ్ రత్నకుమార్, ఏసీపీ వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాస్, డిప్యూటీ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) లక్ష్మోజి, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ.. కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

టేబుల్ టెన్నిస్ పోటీలకు అంపైర్‌గా ఎల్ఐసీ ఉద్యోగి శర్మ

దాబాగార్డెన్స్: ఈ నెల 20 నుంచి 27 వరకు జమ్మూకాశ్మీర్‌లో జరగనున్న సీనియర్ నేషనల్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలకు బ్లూ బ్యాడ్జి అంపైర్‌గా ఎల్ఐసీ ఉద్యోగి డీవీఎస్‌వై శర్మని టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నియమించింది. శర్మ ఇటీవల గోవాలో జరిగిన వరల్డ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో, కర్ణాటక రాష్ట్రం ధార్వాడ్‌లో జరిగిన నేషనల్ రిఫరీ కోర్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి. సుధాకరబాబు, మేనేజర్ (పర్సనల్) భగవాన్‌ప్రసాద్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జి. వరప్రసాద్, అధ్యక్షురాలు ఎం. కామేశ్వరి, ఎల్ఐసీ స్పోర్ట్స్‌క్లబ్ సభ్యులు, విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం సభ్యులు అభినందించారు.

సీఎస్ రావు మరణం తీరని లోటు

మహారాణిపేట : ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన నిస్వార్థ సేవా తత్పరుడు సీఎస్ రావు అని, ఆయన మరణం విశాఖ నగరానికే కాకుండా ఆంధ్రరాష్ట్రానికి తీరని లోటు అని వైజాగ్ బ్రాహ్మిణ్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు టీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సర్వీసులో నిజాయితీగా పని చేయడమే కాకుండా పదవీ విరమణ చేసిన తర్వాత కూడా సమాజానికి నిజాయితీగా సేవలందించిన ఘనత ఆయనకే దక్కుతుందని సొసైటీ అధ్యక్షుడు కావూరి చరణ్‌కుమార్ అన్నారు. రావు మరణం తీరని లోటు అన్నారు. సీఎస్‌రావు మరణంతో విశాఖ నగరం ఒక పెద్ద దిక్కును కోల్పోయిందని, ప్రజా స్పందన వేదిక ద్వారా ఆయన సమస్యలపై స్పందించిన తీరు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ అన్నారు. తన తండ్రి ద్రోణంరాజు శ్రీనివాసరావు, సీఎస్ రావు సంయుక్తంగా విశాఖ నగర ప్రజలకు సంబంధించిన అనేక ప్రజా పోరాటాల్లో సమన్వయంతో పని చేసి నగరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూర్చారని అన్నారు. ఆయన మరణం వల్ల ఏర్పడిన లోటును ఎవరూ తీర్చలేరన్నారు.

కేజీహెచ్ ఉద్యోగులకు ఎముక సాంద్రత పరీక్ష



సిబ్బందికి ఎముక సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మహారాణిపేట : కేజీహెచ్‌లో రెగ్యులర్, కాంట్రాక్టు, సెక్యూరిటీ, శానిటేషన్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గత రెండు రోజులుగా ఉచిత ఎముక సాంద్రత పరీక్ష నిర్వహిస్తున్నారు. 45 సంవత్సరాలు దాటిన స్త్రీలు, 55 సంవత్సరాలు దాటిన పురుషులకు ఈ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఏఆర్ఎం డాక్టర్ జగదీష్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్ రెండు రోజుల పాటు 242 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ బోన్ డెన్సిటీ తగ్గితే ఎముకలు విరిగిపోవచ్చన్నారు. ఎముకల్లో కాల్షియం సాంద్రత తక్కువగా ఉంటే ఆలసట, నీరసానికి గురి కావడంతో పాటు ఎక్కువ దూరం నడవలేరని అన్నారు. అలాంటి వారు ఆకుకూరలు, మాంసాహారంతో పాటు కాల్షియం టాబ్లెట్లు తీసుకోవాలని తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు



బీవీకే కళాశాల వద్ద విద్యార్థుల సందడి



బుల్లయ్య కళాశాల వద్ద హాల్ టికెట్ నంబర్ చూస్తున్న విద్యార్థులు

సీతంపేట: ఇంటర్మీడియట్ సెకండియర్ ఫైనల్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్తర నియోజకవర్గంలోని పలు కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు ఉదయం 7.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంతో అక్కడ సందడి నెలకొంది. గంట ముందుగానే పరీక్షా కేంద్రంలోకి స్టూడెంట్లను అనుమతించారు. సీతంపేట పరిధిలో బుల్లయ్య కళాశాల, బీవీకే కళాశాల, శ్రీవిశ్వ కళాశాల, చైతన్య కళాశాల్లో ఇంటర్ పరీక్షలు జరిగాయి. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా అప్పన్న ఆర్జిత సేవలు



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు



స్వర్ణపుష్పాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై అధిష్టంపజేసి 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణమంపడంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

త్యాగనిరతికి నిలువుటద్దం పొట్టి శ్రీరాములు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మహాత్మాగాంధీ హైస్కూల్ విద్యార్థులు



పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అమరజీవికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, పాఠకులు

అల్లిపురం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి దాబాగార్డెన్స్‌లోని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, పార్టీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, వార్డు ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివజ్యోతి పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని, నిస్వార్థ సేవను, నిష్కళంక కృషిని కొనియాడారు. విద్యార్థులు ఆయనలా సమున్నత వ్యక్తిత్వాన్ని, విలువలను అలవరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

35వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..

జగదాంబ: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పాటుపడిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. గురువారం వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయంలో పొట్టిశ్రీరాములు 122వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విల్లూరి మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవానికి, తెలుగు రాష్ట్రావతరణకు ఆయన చేసిన త్యాగం వల్లే ఈరోజు మనం ఆంధ్రులుగా చెప్పుకుంటున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ మల్లిబాబు, ధర్మకర్తలు కంటిపిల్లి వరలక్ష్మి, మంగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మహంతి గౌరీశంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

దాబాగార్డెన్స్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి చిత్రపటానికి విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్ ఎల్ఆర్ వర్మ, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

వాసవీ భవన్‌లో..

పాతనగరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద వాసవీ భవన్ ప్రాంగణంలో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య యువజన సంఘం ప్రతినిధులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ భారతదేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి ఆద్యుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు బాధ్యుడు, నిష్కలంక దేశభక్తుడు పొట్టి శ్రీరాములు ఆర్యవైశ్య కులానికి చెందినవారు కావడం మన అదృష్టమన్నారు. పూర్వ మద్రాసు రాష్ట్రంలో తెలుగు వారికి జరుగుతున్న అన్యాయానికి నిరసనగా తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం సాధించే దిశగా పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. పొట్టి శ్రీరాములు సేవలు గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టడం, ఆయన పేరిట విశ్వవిద్యాలయం నెలకొల్పడం, ఆయన జయంతి, వర్ధంతిని అధికారికంగా జరుపుకోవాలని ఆదేశాలు ఇవ్వడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో పూసర్ల సురేష్, దుర్గా సోమేశ్వరరావు, గ్రంధి దుర్గాప్రసాద్, కందుల మధుబాబు, సీబీఎస్ రామకృష్ణ, పెనుగొండ కామరాజు, కురుమేటి బలరాం తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ వితరణ



హ్యాండీక్యాప్డ్ ఇన్‌స్టిట్యూట్‌కు సామగ్రి అందజేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

సీతంపేట: పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా వాసవీ క్లబ్ అల్లిపురం శాఖ ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెంలోని పావని మల్టీపుల్ హ్యాండీక్యాప్డ్ ఇన్‌స్టిట్యూట్‌లో మానసిక, మూగ, బధిర విద్యార్థులకు రూ.6 వేలు విలువ చేసే సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ డి.వి.ఎస్.ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలకు కొనసాగుతున్న శిక్షణ



ఆశ వర్కర్లకు శిక్షణ ఇస్తున్న పీహెచ్ఎన్‌వో సత్యవతి

ఆరిలోవ: పైనాపిల్ కాలనీ వద్ద జిల్లా మహిళా ప్రాంగణంలో ఆశ కార్యకర్తల శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన 200 మంది ఆశ వర్కర్లకు ఈ నెల 14న డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ప్రారంభమైన శిక్షణ ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగనుంది. గురువారం పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ (పీహెచ్ఎన్‌వో) సత్యవతి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఉద్యోగంలో పనితనం మరింత మెరుగుపరచడంతో పాటు ఆరోగ్యంపై ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పించాలో వివరించారు. సీజనల్ వ్యాధులు, క్షయపై ప్రజలు ఎలాంటి జాగ్రతలు పాటించాలి, లింగ నిర్ధారణ వల్ల ఎదురయ్యే సమస్యలు తెలియజేశారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న యువజన కాంగ్రెస్ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలోని హోటల్ సింకా గ్రాండ్‌లో బుధవారం ప్రారంభమైన కాంగ్రెస్ యువజన విభాగం శిక్షణ తరగతులు రెండో రోజు గురువారం సాయంత్రంతో ముగిశాయి. కాంగ్రెస్ పార్టీ, నాయకులు దేశానికి చేసిన సేవలను, స్వాతంత్ర్యానంతరం నాటి పరిస్థితులను ఈ సందర్భంగా తెలియజేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చి పాల్గొన్న యువజన కాంగ్రెస్ సభ్యులందరికీ ప్రశంసాపత్రాలను రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు తదితరులు పాల్గొన్నారు.